క్లుప్తంగా

నేడు రక్తనాళాల సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్యం

చింతూరు: ఐటీడీఏ, హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్క్యులర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో రక్తనాళాల సంబంధిత వ్యాధులకు చికిత్స అందజేయనున్నట్టు చెప్పారు. ఉబ్బిన రక్తనాళాలు, పాదాల వాపు, కాళ్లకు, తలకు రక్త సరఫరా లేకపోవడం తదితర వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

11న మండల సర్వసభ్య సమావేశం

గూడెంకొత్తవీధి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11న సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

కొత్త చట్టాన్ని వ్యతిరేకించాలి

చింతూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టాన్ని అందరూ వ్యతిరేకించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య అన్నారు. మంగళవారం ఆయన చింతూరులో మాట్లాడుతూ పేదలు, దళితులు, ఆదివాసీలకు ఈ చట్టం ఎంతో ప్రమాదకరమన్నారు. ప్రజాఉద్యమాలు, ప్రజాస్వామిక వాదులను అణచివేసేందుకు కొత్తగా అమలు చేస్తున్న ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: పూర్వ ప్రాథమిక విద్యార్థులకు అక్షరాలు, పద్యాలు నేర్పించాలని సీడీపీవో విజయ కుమారి అన్నారు.ఆమె మంగళవారం కర్నికపాలెం,బొర్రంపేట అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినూత్నంగా బోధన చేస్తే పిల్లలు శ్రద్ధగా వింటారని తెలిపారు. న్యూట్రీ గార్డెన్‌లను తయారు చేయాలని సూచించారు .ప్రతి నెల పిల్లల ఎత్తు బరువులను నమోదు చేయాలన్నారు.

55 మందికి వైద్య పరీక్షలు



టైర్‌లో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారి

కొయ్యూరు: చిట్టింపాడు పంచాయతీ గోపవరంలో మంగళవారం నిర్వహించిన శిబిరంలో 55 మందికి వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై డౌనూరు వైద్యాధికారి వరప్రసాద్ అవగాహన కల్పించారు. గ్రామంలో పర్యటించి పాడైన టైర్లలో ఉన్న వర్షం నీటిని, కొబ్బరి చిప్పలు,ఇతర పాత్రల్లో ఉన్న నీటిని పారబోయించారు. వారానికి ఒక రోజు విధిగా డ్రైడే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెట్ల గాంధీ, వైద్య సిబ్బంది కిరణ్, రాజారావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



గన్నేరుపుట్టులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ శాంతకుమారి

హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ గన్నేరుపుట్టులో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.18లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ మఠం శాంతకుమారి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు మౌలిక సదుపాయలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మత్స్యకొండబాబు,నాయకులు పాంగి లక్ష్మి,సంజీవ్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలో సుంకరమెట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉపేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యా.దులు, అతిసార నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధు లు ప్రబలే ప్రమాదం ఉందని, ముందస్తుగా ప్రజలను వైద్యసిబ్బంది అప్రమత్తం చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో అతిసార వ్యాధితో చిన్నపిల్లలు మరణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తం

హుకుంపేట: డెంగ్యూ వ్యాధి సోకకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిణి శాంతి తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవరం సందర్భంగా మంగళవారం ఆశా కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోదకొండమ్మ ఆలయం ప్రాంగణంలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కోడ మహేష్, సిబ్బంది జమ్మి,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : డెంగ్యూపై అవగాహన కల్పిస్తూ స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రత పాటించాలను, క్రమం తప్పకుండా చేతులు శుభ్రం చేసుకోవాలని, నిల్వ నీటిని తీసివేయాలని, ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. పిడత



హుకుంపేటలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మామిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరతన్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సబ్ యూనిట్ అధికారి సూరిబాబు, ఆశలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డయేరియాను నిర్మూలిద్దాం

గూడెంకొత్తవీధి: అవగాహనతో డయేరియా మహమ్మారిని నిర్మూలించవచ్చని పెదవలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కోమలి అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెదవలసలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డయేరియా నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, ఈవో బాలరాజు, హెచ్‌వీ దేవమణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రకృతి సాగుతో ఆరోగ్యకర పంటలు



మాట్లాడుతున్న ఏపీఎం సుందరమ్మ

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకర పంటలను పండించవచ్చని ఐకేపీ ఏపీఎం సుందరమ్మ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రైతు సాధికార సంస్థ(ఏపీఆర్‌వైఎస్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి సాగు విధానంలో పండించిన పంటల ప్రదర్శన, విక్రయశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో ప్రకృతి సాగు పద్ధతుల్లో పండించిన పంటలను విక్రయించి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రకృతి విధానంలో పండించిన పంటలను భుజించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులవుతామని తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల భూములు సారవంతంగా మారుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ యూనిట్ ఇన్‌చార్జ్‌లు మేడ ప్రసాద్, ఎస్.రామలింగం,ఐఆర్‌పీలు పి.సోమన్నదొర,పి.కొండమ్మ,రైతులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలి

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర



ఆస్పత్రిలో రోగుల సమస్యలు తెలుసుకుంటున్న గిరిజన సంఘం సభ్యులు

అరకులోయ రూరల్: గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరారు.మండల కేంద్రం అరకులోయలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని గిరిజన సంఘం సభ్యులు మంగళవారం సందర్శించి, రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో బృందం సభ్యులు మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. రోగులకు పెడుతున్న భోజనం మరింత నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బలదేవ్,నాయకులు రామారావు, భగత్‌రాం పాల్గొన్నారు.

పాస్టర్లకు అండగా ఉంటా

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగాన్ని దుశ్శాలువాతో సత్కరిస్తున్న పాస్టర్లు

అనంతగిరి: పాస్టర్లకు అన్నివిధాలుగా అండగా ఉంటూ సహాయసహకారాలు అందిస్తానని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. ఏజెన్సీ గాస్పెల్ బ్యాండ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఏర్పాటు చేసిన 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మర్రిగుడ షాలేమ్ ప్రార్థనామందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పాస్టర్లు అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. పాస్టర్ల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటుగా మండల కేంద్రంలో పాస్టర్లకు సామాజిక భవనం నిర్మాణానికి 5 సెంట్ల స్థలం కేటాయించేలా కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. అనంతరం పాస్టర్ల ఆధ్వర్యంలోని ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ శెట్టినీలవేణి, జెడ్పీటీసీ దీసరి గంగరాజును సన్మానించారు. ఈకార్యక్రమంలో పాస్టర్లు సూర్యారావు, డేవిడ్‌పాల్, పీటర్, నీలయ్య, జోసెఫ్, దయానిధి, రూబెన్, భేన్యమిన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి



డ్రైనేజీ నిర్మాణపనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: మండలంలోని పలు గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులు వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి సూచించారు. స్థానిక రామాలయం వీధిలో రూ.6 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెడ్పీ నిధులలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణంతో పాటు అన్ని నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సంబంధిత ఇంజినీరింగ్ అధికార్లు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ డిపోల తనిఖీ



రాజవొమ్మంగి-1 ఎఫ్‌పీ షాపులో సరకుల నిల్వను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

రాజవొమ్మంగి: మండలంలోని పలు జీసీసీ సరకు డిపో (ఎఫ్‌పీ షాపు)లను స్థానిక తహసీల్దార్ ఎస్.వి. సత్యనారాయణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజవొమ్మంగి-1, దూసరపాము డిపోల్లో స్టాక్ బోర్డు (సరకుల పట్టీ)లు, ధరల బోర్డులను ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డు ప్రకారం సరకు సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. తూకాల్లో ఏవైనా తేడా ఉందా అని చూశారు. ప్రజాపంపిణీలో జాప్యం తగదని సూచించారు. ఇంటింటికీ రేషన్ పంపిణీలో భాగంగా ఎండీయూ వాహనాలకు సకాలంలో సరకు అందజేయాలని ఆదేశించారు. ప్రజాపంపిణీ కోసం మండలంలో ఎనిమిది ఎండీయూ వాహనాలను ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల ఇప్పటికే ఇంటింటికి రేషన్ సరఫరా మొదలయ్యిందన్నారు. మండలంలో మొత్తం 13,238 బియ్యం కార్డులు ఉన్నాయన్నారు. ప్రతి నెల ఎఫ్‌పీ షాపుల ద్వారా 224 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం పంపిణీ జరుగుతోందని చెప్పారు. వీఆర్వో సూర్యకాంతం పాల్గొన్నారు. స్థానిక డిప్యూటీ తహసీల్దార్ అల్లి సత్యనారాయణ కేంద్రలోని ఎఫ్‌పీ షాపును తనిఖీ చేశారు.

పదవీ విరమణ చేసిన వీఆర్వోకు సన్మానం



భూపతిరాజు దంపతులను సన్మానిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

కొయ్యూరు: కినపర్తి వీఆర్‌వోగా చేస్తూ పదవీ విరమణ చేసిన డి.భూపతి రాజు దంపతులను స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దారు రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో సేవలు అందించి భూపతిరాజు మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీటీలు సతీష్, సీతారాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గొలుగొండలో డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది ఇచ్చే సలహాలను పాటించాలని గొలుగొండ, చీడిగుమ్మల వైద్యాధికారులు శ్యామ్, ధనుంజయ్, కీర్తి తెలిపారు. డయేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు గొలుగొండలో మంగళవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సీజన్‌లో కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన, చికిత్స కోసం గ్రామాల్లో ఇప్పటికే పలు వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే మంచి నడవడిక అలవర్చుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, ఎంపీటీసీ విజయలక్ష్మి

ముంచంగిపుట్టు: విద్యార్థి దశలోనే మంచి నడవడిక అలవర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు.మండలంలో జర్జుల పంచాయతీ కులబీరు ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు.పాఠశాలలో జరుగుతున్న పనులు,విద్యార్థుల సామర్థ్యం గురించి ఉపాధ్యాయులు వివరించారు.అనంతరం విద్యార్థులకు స్థానిక ఎంపీటీసీ విజయలక్ష్మి,వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పద్మారావు,నేతల చేతులమీదుగా యూనిఫాంలు,పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు అశ్రద్ధ చేయకూడదని, వర్షకాలంలో వేడి నీటినే తాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కె.సాధూరాం తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ

పాడేరు : పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, మినీ గురుకులాలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఇటీవల చేపట్టిన అక్రమ డిప్యూటేషన్లకు తక్షణమే రద్దు చేయాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన విద్యా సంస్థల్లో ప్రిన్సిపాల్‌గా సిఫారసుతో డిప్యూటీ వార్డెన్‌ను నియమిస్తున్నారన్నారు. విద్యార్థులకు సబ్జెక్టులను బోధించాల్సిన ఉపాధ్యాయులు ఆ బాధ్యతను పక్కన పెట్టి డిప్యూటీ వార్డెన్లుగా పని చేసేందుకు మక్కువ చూపుతున్నారని చెప్పారు. గిరిజన విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టకుండా డబ్బులు జేబుల్లో వేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ దృష్టిసారించి అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలీఫ్లవర్ సాగుపై రైతుల ఆసక్తి



ఆర్లిలో సాగులో ఉన్న కాలీఫ్లవర్ పంట

కె.కోటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు కాలీఫ్లవర్ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట సాగు ప్రారంభించిన రెండు నెలలకే దిగుబడి వస్తుండడంతో రైతులు సాగు పట్ల మక్కువ చూపుతున్నారు. ఆర్లి, కె.సంతపాలెం, గవరపాలెం, దాలివలస, బొట్టవానిపాలెం, గొల్లలపాలెం, గొంపవానిపాలెం గ్రామాల్లో సుమారు 60 ఎకరాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట సాగు మొదలై 15 రోజులే అయిందని రైతులు చెప్పారు. ఎకరా పొలంలో పంట సాగుకు దుక్కులు, గొప్పులు, సస్యరక్షణ చర్యలు, కూలీల పెట్టుబడిగా రూ.20 వేల వరకు ఖర్చవుతుందన్నారు. కూరగాయల పంటలకు ప్రస్తుతం ధరలు బాగా ఉండటంతో పంట చేతికి వచ్చాక మంచి లాభాలు పొందగలమన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామ సభల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమణ

దేవరాపల్లి: రాజ్యాంగ నిబంధనల మేరకు జరిపించాల్సిన గ్రామ సభల పట్ల అధికార్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రం దేవరాపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో ప్రజలకు కనీస సమాచారం లేకుండా గ్రామ సభ నిర్వహించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. గ్రామ సభకు మూడు రోజులు ముందుగా గ్రామంలో దండోరా, ప్రధాన కూడళ్లలో పోస్టర్స్ అతికించి ప్రజలకు తెలపాలన్నారు. పంచాయతీలో అవినీతి, అక్రమాలు బయట పడతాయన్న భయంతోనే అధికార్లు గుట్టు చప్పుడు కాకుండా గ్రామ సభ నిర్వహించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

ప్రజలు లేకుండా గ్రామ సభ నిర్వహించడంతో ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు ముందస్తు సమాచారం ఇస్తూ, మళ్లీ గ్రామ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను, మండల సభ్యులు చొక్కాకుల రమణ, గంగవంశం సంతోష్, రంది వెంకటరమణ తదితర సభ్యులు పాల్గొన్నారు.

పాల సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ



చీడికాడ: మండలంలోని మంచాల విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడిగా గ్రామ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత కశిరెడ్డి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల సంఘం పాలకవర్గంలో ఇద్దరు డైరెక్టర్ల పదవీ కాలం ముగియడంతో రామకృష్ణతో పాటు పార్టీ సానుభూతిపరులు కశిరెడ్డి వరలక్ష్మి రెండవ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం డైరెక్టర్లు రామకృష్ణను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు



పుష్పమ్మకు జీపీఎఫ్ చెక్కును అందిస్తున్న వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్

మాడుగుల రూరల్: ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని కేజే పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్‌వీఎస్ఎస్ ప్రసాదుపాత్రుడు తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కేజే పురం పీహెచ్‌సీ సీహెచ్‌వో చింతాడ పుష్పమ్మకు మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో ఘనంగా సన్మానించారు. పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన వీడ్కోలు సభలో వైద్యాధికారులు ప్రసాదు పాత్రుడు, లీలాప్రసాద్ మాట్లాడుతూ పుష్పమ్మ సేవల్ని కొనియాడారు. స్థానిక సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ వార్డు సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులతో పాటు బుడబండి రాజు, విశ్రాంత డీపీఎం చిన తిరుపతి, ఆరోగ్య సహాయకుడు పేర్ని శంకర్ తదితర్లు ఆమె అందించిన సేవల్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పమ్మ, ప్రసాద్ దంపతులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందించారు. పుష్పమ్మకు జీపీఎఫ్ చెక్కును వైద్యులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్ చేతుల మీదుగా అందించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



ఏఎల్ పురంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ హరి, ఎస్ఐ ఉపేంద్ర

గొలుగొండ: భారత రాజ్యాంగం, కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ హరి, కృష్ణదేవిపేట, గొలుగొండ ఎస్ఐలు ఉపేంద్ర, కృష్ణారావు తెలిపారు. మంగళవారం కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ హరి మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు చట్టాలు అందరికీ సమానమేనన్నారు. చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉంటే, చాలా దాడులు, మోసాల నుంచి బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.